# గాంధారి ఓరిమి

## ప్రాచీన గాథాలహరి

**పి. గణపతిశాస్త్రి**

ఆనాటితో రాజలోకానికంతటికీ ప్రళయంగా పరిణమించిన భారత యుద్ధం సమాప్తమైపోయింది! కాని హస్తినాపుర రాజవీథుల్లో ఎక్కడవిన్నా హాహాకారాలే! ఎటుతిరిగినా హృదయవిదారకమైన కరుణాక్రందనాలే! నగరం నగరం అంతా ఒకే కంఠంతో శోకిస్తున్నదా అన్నట్టున్నదా హస్తినాపురం! ఆ మహాభారతయుద్ధంలో తుట్టతుదకు జయాపజయాలెలాగ పరిణమించినా సమీప బంధు భృత్యాదులమృతికి విలపించనివారొక్కరు కనబడలేదు!

ధృతరాష్ట్రుడానాటి అపరాహ్ణవేళ గాంధారీదేవితోను, మిగిలిన అంతఃపురస్త్రీలతోను కలిసి యుద్ధరంగంలో హతులైపడి ఉన్న బంధుభృత్యాదుల నొకసారి సందర్శింతామనే ఆశతో మెల్లిగా అడుగులు వేసుకుంటూ అక్కడికి చేరుకున్నాడు.

ఆకాశంలో రాబందులు, గద్దలు చక్రాకారంగా తిరుగుతూ మధ్య మధ్యన అక్కడ వాలుతూ రెక్కలతో చిన్న చిన్న సవ్వడులు చేస్తున్నాయి. ఆ అపరాహ్ణవేళ ఆకాశం అంతా ఎర్రఎర్రని మబ్బులతో చేగురుపూసినట్లు మారిపోయింది. నలువైపులా విరిగిపోయిన రథాలు, ఆయుధాలు మొదలైనవన్నీ గుట్టలుగుట్టలుగా పడి ఉన్నాయి. దూరదూరంగా నక్కల అరుపులు సన్నని ఏడుపుల్లా వినవస్తున్నాయి. మృతులై పడిపోయిన యోధుల కవచాల మీద దృశ్యాదృశ్యంగా ప్రసరించిన సూర్యకాంతి అరుణరక్తప్రవాహంలా మెరిసింది!

ధృతరాష్ట్రుడా యుద్ధభూమి మధ్యభాగానికి చేరుకోగానే పరిజనులా సమీపంలో హతులై పడిఉన్న కౌరవకుమారుల నందరినీ వారివారి పేరులతో వేర్వేరుగా వివరించి విన్నవించారు. వారింకా ఇతరాప్తబంధువులను గురించి కూడా కొంచెంకొంచెంగా విజ్ఞప్తిచేశారు.

ఇవన్నీ నిశ్చలంగా నిలబడి వింటూన్న ఆ వృద్ధనృపతి ఆ కురుక్షేత్రంలో మొదలు నరికిన కదళీతరువులా కూలబడిపోయాడు.

వారందరి దారుణమరణాలు తలచుకునే సరికి వృద్ధనరపతి హృదయం అంతా శోకభారంతో వెయ్యి వ్రయ్యలైపోయింది! ఆ మహాసామ్రాజ్య వైభవమంతా చివరకావిధంగా నామమాత్రావశేషమైపోయేసరికి ప్రపంచమంతా ఆక్షణంలోనే అంధకారబంధురమైపోయినట్లుగా స్ఫురించిందా అంధచక్రవర్తికి!

ఆ కౌరవకుమారుల శైశవవినోదాలు, వైభవాలు అతని హృదయంలో వివరమై వెలవెలబోతూన్న వేయి మహేంద్రజాల దృశ్యాల్లాగ మెరిసిపోయాయి!

అతడు తెరలు తెరలుగా స్ఫురించే ఆప్తబంధువుల స్మృతిభారంలో కుంగిపోయి, పట్టి పసిపాపలా వలవలా వాపోయినాడు.

కొంతసేపటికి విదురుడా వృద్ధ చక్రవర్తి సన్నిధికి వచ్చి వినయంగా ఇలాగ విన్నవించుకొన్నాడు.

"మహాప్రభూ! తీవ్రమైన శోకభారంతో కుంగిపోయినవారి కుపశమన వాక్యాలవల్ల ప్రయోజనమేమీ లేదని నే నెరుగుదును! కాని ఒక్క మనవి!

మీ కుమారులకోసం వేలాది రాజులు, రారాజులు, తమ తమ ప్రాణాలన్నీ ఈ యుద్ధాగ్ని జ్వాలలలో తృణప్రాయంగా ఆహుతి ఇచ్చి వీరస్వర్గం చేరగొన్నారు! మరి వారందరికీ ఇప్పుడు పరలోక విధులు నిర్వర్తింపజేయ్యడం మన ధర్మం!

యుద్ధరంగంలో మరణించినవారందరు వీరస్వర్గంలో సకల భోగాలు అనుభవిస్తారని ధర్మవేత్తలు చెబుతున్నారు. అట్టివారికోసం విలపించడం కేవలం అజ్ఞానమే అనిపించుతుంటుంది! అదీన్నీ గాక ఆత్మకు శరీరబంధం అన్నది - ఉన్నంతవరకే గదా ఈ బాంధవ్యాలు, ఈ మమకారాలూను! ఆ బంధం నశించిపోయిన తరవాత దానితోబాటు ఈ బాంధవ్యాలు, ఈ మమకారాలు కూడా నశించిపోతాయిగదా! ఇక ఈ ఆర్తనాదాలవల్ల ప్రయోజనమేముంది! మహాప్రభూ!"

పిమ్మట వ్యాసభట్టారకుడు కూడా ఆ చక్రవర్తి సన్నిధికి విచ్చేసి ఆయన కనేక విధాలుగా హితవచనా లుపదేశించినాడు. ఇక యుధిష్ఠిరుడే కుమారుడనుకొని ఎలాగో అలాగ మనశ్శాంతి పొందవలసిందని హితవుపదేశించాడు. ధృతరాష్ట్రుడీ వాక్యాలవల్ల కొంచెం సేదదేరినట్లు కనిపించాడు. అయితే ఆయన చుట్టూరా ఉన్న స్త్రీలంతా భయంకర శ్మశానంగా మారిపోయిన ఆ యుద్ధక్షేత్రంలో నేలపాలైన భర్తృపుత్రాదులను చూస్తూ - అలాగే పరిపరి విధాలుగా విలపించారు!

అటుపిమ్మట కొంతసేపటికి ధర్మరాజు ద్రౌపదితోను, భీమసేనాదులతోను, తదితర పరివారంతోను కలిసి అక్కడికి వచ్చినాడు. ఆ స్త్రీ లందరిమధ్యనుంచీ మెల్లిదిగా అడుగులు వేసుకుంటూ ఆ చక్రవర్తిసమీపానికి వచ్చి నిలుచున్నాడు. క్షణకాలం పాటక్కడివారంతా తమ శోకాలు విరమించి, ఆ ధర్మపుత్రుని వైపు తిలకించారు. పిమ్మట పరిజనులా ధృతరాష్ట్రమహీపతి కతని రాక తెలియజేశారు. ధర్మరాజు ధృతరాష్ట్రుని పాదాలు స్పృశించి నమస్కారం చేశాడు. ధృతరాష్ట్రుడతన్ని ఎంతో ఆప్యాయంగా గుచ్చి కౌగలించుకొన్నాడు. కాని ఆ కౌగలింతలో ఎక్కడా

అర్థమైతే స్ఫురించలేదు. అదంతా కేవలం నటన మాత్రమే! ఆ ధర్మమూర్తికిది తెలియకపోలేదు!

అంతలో శ్రీకృష్ణుడు కూడా వారిని చేరుకొన్నాడు. ధృతరాష్ట్రుని సమీపించి నెమ్మదిగా ఆయన చెవిలో భీమసేను డక్కడికి వచ్చిన విషయం తెలియజేశాడు.

భీమసేనుని పేరు వినేసరికి ధృతరాష్ట్రుని హృదయం అంతటా దావానల జ్వాలలు చెలరేగాయి. గుడ్డివైనా అతని నేత్రాలు లోలోపల అగ్నిగోళాలై ప్రజ్వలించాయి! కాని ఆ ధృతరాష్ట్రునిముఖంలో పైపైన సుప్రసన్నమైన చిన్న చిరునవ్వు మాత్రమే స్ఫురించింది!

ధృతరాష్ట్రునికి పాదాభివందనం చేదామనే అభిప్రాయంతో భీమసేను డాయన సమీపానికి వచ్చినాడు. అది చూడగానే శ్రీకృష్ణుని ముఖంలో సన్నని కనుసన్న మెరిసింది! భీమసేను డది గ్రహించుకొన్నాడు.

భీముడు ధృతరాష్ట్రుని పాదాలు స్పృశిస్తూ సవినయంగా నమస్కరించాడు. ఆ అంధ నృపతి అతన్ని గుచ్చి కౌగలించుకోవాలనే అపేక్షతో ఆప్యాయంగా దగ్గరికి తీసుకొన్నాడు. ఇంతలో ఏదో అక్కడికి జరిగినట్టయింది! ధృతరాష్ట్రుడు తన యావచ్ఛక్తి వినియోగించి భీమసేనుని గాఢంగా గుచ్చి కౌగలించుకొన్నాడు. ఆ వృద్ధ చక్రవర్తి బిగి కౌగిలింతలో ఫెళ ఫెళ ధ్వనులు వినిపించాయి! అందరు విస్తుపోయి ఆవైపు చూశారు.

ధృతరాష్ట్రుడు దిగాలుపడిపోయి నేల మీద చదికిలపడిపోయాడు:

"అయ్యో! నా క్రోధం నిగ్రహించుకోలేక భీమసేనుని కౌగిలింతలో చూర్ణం చేసి వేశాను! ఎంతటి మహాప్రమాదం జరిగిపోయింది! అయ్యో! అయ్యో!" అంటూ అదేపనిగా దుఃఖించడం ప్రారంభించాడు.

శ్రీకృష్ణు డతన్ని సమీపించి మెల్లిగా భుజంమీద చెయ్యివేసి ఇలా ఓదార్చాడు:

"మహారాజా! మీ రింతగా విలపించవలసిన అవసర మేమీ లేదు! నే నీ అవాంతరం ముందుగానే గ్రహించుకొన్నాను. మీరు భీమసేనుని కౌగలించుకొనే క్షణంలో సరీగా అటువంటిదే లోహప్రతిమ ఒకటి మీ సన్నిధికి జరిపించాను. మీ కౌగిలింతలో చూర్ణమైపోయినది లోహప్రతిమే గాని భీమసేనుడు కాదు! ఇంతటితోనైనా మీ కోపం ఉపశమింప జేసుకొని భీమసేనుని మనసారా ఆశీర్వదించవలసిందని ప్రార్థించుకొంటున్నాను."

వృద్ధభూపతి ఇదంతా విని క్షణకాలం పాటు భిన్నుడైపోయాడు. అతని ముఖం వివర్ణమైపోయి అదోలాగయింది! ఆ కోపావేశంలో ఆత్మనిగ్రహం అంతా మంటగలిపివేసి కేవలం పశుప్రాయుడైపోయినాడు! చివరికదంతా ఒక మహాపరాధంగా పరిణమించింది! అంతే గాని దానివల్ల కించిత్తయినా ఫలితం కనిపించలేదు!

తిరిగీ శ్రీకృష్ణు డా ధృతరాష్ట్రుని కనేక విధాలుగా హితోపదేశం చేసి పాండవుల నికనైనా కన్నకొడుకుల్లా ఆదరించవలసిందని ప్రార్థించాడు. ధృతరాష్ట్రునికి పశ్చాత్తాపం వల్ల మనస్సు బాగా కుదుటపడింది. పాండవులను, భీమసేనుని అనేకవిధాలుగా ఆశీర్వదించి ఆప్యాయంగా ఆదరించినాడు.

పిమ్మట వారందరు సవినయంగా ఆ చక్రవర్తిదగ్గర సెలవు తీసుకొని అంతఃపురస్త్రీ పరివేష్టితయై విలపిస్తున్న గాంధారీదేవి సమీపానికి వెళ్ళారు.

వ్యాసమహర్షి ఆమె కనేక విధాలుగా దుఃఖోపశమనం కలిగిస్తున్నాడు.

"అమ్మా! నీకు పాండవులు కౌరవులు ఒకలాంటివారే! యుద్ధారంభంలో నీవన్న మాటలు జ్ఞాపకంలేవా! ధర్మమే జయించవలెననిగదా! నీవప్పు డాశీర్వదించినావు! ఆ విషయం ఒక్కసారి స్మరించుకో! గతజలసేతు బంధనంవల్ల ప్రయోజనంఏమిఉన్నది! ఓరిమివహించి పాండవులను దీవించిపంపించు! తల్లీ!"

గాంధారి వ్యాసమహర్షివాక్యాలు విని, క్షణకాలం ఏమీ అనలేక అలాగే కన్నీరు విడిచింది. చిట్టచివరి కిలాగన్నది.

"పాండవులకు విజయంకలిగిందని నేనసూయపడడంలేదు! వారూ నాకుమారులే! శకుని దుశ్శాసనుల దుష్కృత్యాలవల్లనే ఇంతటి వైపరీత్యం కలిగినదని నేనెరుగుదును! దీనిలో నిజంగా భీమార్జునుల దోషమేమీ లేదు! కాని వాసుదేవుని సమక్షంలో జరిగిన గదాయుద్ధంలో భీముడన్యాయఘాతంతో దుర్యోధనుని పడగొట్టివేసినాడు. అంతటి అన్యాయం జరుగుతున్నా శ్రీకృష్ణుడలాగే ఉపేక్షించి ఊరకున్నాడు. ఇది తలుచుకుంటూంటే నా హృదయం దహించుకుపోతున్నది!"

అని ఆమె పసిపాపలా వాపోయింది!

ఈ మాటలు విన్న భీమసేనుడు నెమ్మదిగా ఆమెతో ఇలాగన్నాడు:

"అమ్మా! కేవలం నా ప్రాణసంరక్షణకే అవిధంగా అధర్మయుద్ధానికి తలపడినాను. అది ధర్మమైనా అధర్మమైనా నన్ను మన్నించవలసిందని వేడుకొంటున్నాను. నీ కుమారుడు మాయాద్యూతంలో అన్నగారిని వంచించినాడు. మరి ద్రౌపదిని భంగపరిచిన విధం నీవెరిగినదే! అంతటితో ఆగక మా అర్ధరాజ్యంకూడా అపహరించివేసినాడు.

---

# రైట్ కూర్చో

"ఏహోయ్ కాకీ చొక్కా పక్క బ్బాయ్! రెండు సర్వనామాలేవైనా చెప్పు" అన్నారు మేస్టారు.

కాకీచొక్కా అబ్బాయికి ఎడాపెడా ఉన్న కుర్రాళ్లలో, మేస్టారు ఎవర్నడిగిందీ తెలియలేదు.

"ఎవరు? నేనా?" అన్నాడు ఒకడు లేచి భయంగా.

"రైట్. రైట్. కూర్చో" అనేశారు మేస్టారు.

---

ఇవన్నీ సహించి చివరికావిధంగా నా వీరగౌరవం నిలబెట్టుకొన్నాను. నా తప్పు మన్నించగలిగిన తల్లివిక నీవొక్కతెవే!"

దీనికి గాంధారీదేవి ఏమీఅనలేదు! ఆమె హృదయంలో అపారమైన శోకసాగరం అలాగే ఉవ్వెత్తుగా పొంగిపరవళ్లు దొక్కింది! కాని ఆలోలోపలి దుఃఖసాగరం చెలియలికట్ట సమీపించినట్టుగా



శ్రీకాఫ్
దగ్గు, ఉబ్బసములకు దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్, మదరాసు-30



15 జ్యూయల్సు చేతిగడియారం రు. 5



స్విస్ తయారీ. 15 జ్యూయల్సు వాస్తవికమైన చేతి గడియారం. 16 ఏళ్లు గ్యారంటీ. ధర రు. 5. పోస్టేజీ రు. 1/8- అదనం. Swiss Watch Suppliers P. B. 1392, (A. P. M.) Delhi.



హైదరాబాదు రాజప్రముఖ్ శ్రీ ఉస్మాన్ అలీఖాన్, రిపబ్లిక్ దినోత్సవంనాడు విందుచేశారు. శ్రీ జైన్ యార్ జంగ్, డా॥ రామకృష్ణరావు, శ్రీ ఉస్మాన్ అలీఖాన్

# ★ గాంధారి ఓరిమి ★

అలాగే నిలిచిపోయింది! ఆమె అలాగ నిశ్చలంగా ఏదో ధ్యానిస్తూ ఉండిపోవడం చూచి పాండవులందరు భయభ్రాంతులైపోయినారు! భర్త జాత్యంధతవల్ల ఆమె తన నేత్రాలకు కూడా ఆచ్ఛాదనం ఏర్పరుచుకొని కళ్లున్నా అంధురాలే అయిపోయింది! ఆవిధంగా అంధురాలైపోయిన ఆవృద్ధ జనని క్రోధదృష్టి కిరణలేశంపడి భస్మమైపోతామేమో అనే భయంతో ఆమెకెదురుగా నిలిచినవారంతా పక్కపక్కలకు తొలగిపోయారు!

అలాగ స్తబ్ధురాలైపోయిన ఆమె చిట్టచివరికి భీమసేనునితో ఇలాగన్నది!

"నాయనా! నా నూరుగురు కుమారులలోను ఒక్కరినైనా మిగిల్చి ఉంటే ఈ అంత్యకాలంలో మేమిద్దరము ఏదోవిధంగా ఓదార్పు పొంది ఉండే వారము గదా! అయ్యో! చిట్టచివరికి నా నూరుగురు కుమారులలోను, ఒక్కరు—ఒక్కరైనా మిగల లేదుగదా!" అన్నది గద్గద స్వరంతో. అంతే! ఆమాటలతో ఉద్వృతంగా పొంగి వచ్చిన ఆ శోకసాగరానికి చెలియలికట్టలా నిలిచిన ఆమె నిగ్రహం యావత్తు తుత్తునియలై చెదరిపోయింది!

అంతలో సంధ్యారుణ కాంతులామె ముఖం మీద ప్రసరించాయి. ఆ ఆసురసంజవేళ చీకటివెలుగు లోకే ఒకవిధంగా మసక మసకగా కనిపించాయి. దూర దూరంగా ఆకాశంలో పక్షులు చక్రాకారంగా తిరుగుతూ దీనంగా ఆక్రోశించాయి. ఆసమయంలో ఆమెను ఓదార్చడానికి కూడా ఎవరు ముందుకు రాలేకపోయారు! ఆమె ఆ నూరుగురు కుమారుల బాల్య కౌమారలీలలు స్మరించుకొంటూ శోకం అంతా పేరుకుపోయిన శిలాప్రతిమలాగ అలాగే కూర్చుండిపోయింది! అలాగ కొన్ని క్షణాలు గడిచిపోయాయి. కొంతసేపటి కామె కొంచెం సేదదేరి అతి ప్రశాంతంగా "ధర్మపుత్రుడు రాలేదా?" అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్న పాండవులందరి హృదయాలలోను ఒక భయంకర శాపంలా వినిపించింది! అందరు ఈ మారేదో తీవ్రశాపం ధర్మపుత్రునిపై విరుచుకు పడగలదని గడ గడ వణికిపోయారు. అర్జునుడిక అక్కడ నిలబడలేక శ్రీ కృష్ణుని వెనుకకు వెళ్లిపోయాడు.

ధర్మరాజు వెంటనే ఆమె పాదాలకు సాష్టాంగ నమస్కారంచేసి ఇలాగ విన్నవించుకొన్నాడు

"మహారాజ్ఞీ! నీ కుమారుల మరణానికి కారణభూతుడను నేనే! నీ శాపాగ్నిలో భస్మమైపోవాలనే నా అభిలాష! నా పాపరాశికి మరి అంతకంటె నిష్కృతిలేదు! నాకీ జీవితము, ఈ సామ్రాజ్యము భరింపరాని భారాలైపోయాయి! ఈవిధంగా నీకింతటి దుఃఖం కలిగించిన నాకీ తుచ్ఛజీవితంవల్ల ప్రయోజనమేమీ లేదు!"

గాంధారి హృదయంలో శోక క్రోధాలు రెండు తిరిగి మహోత్తరంగాల్లా లేచి పరవళ్లు దొక్కాయి! ఆసమయంలో పాండవ సంరక్షకుడైన శ్రీ కృష్ణునికి కూడా మార్గమేమీ గోచరించలేదు!

సాష్టాంగపడిన ధర్మరాజు శిరస్సు గాంధారి పాదాగ్రానికి సోకింది. ఆమె లోలోపల పొంగి పరవళ్లు దొక్కుతున్న శోకక్రోధాలు రెండు అతి కష్టం మీద నిగ్రహించుకో గలిగింది. ఆ సమయంలో ఆ మహారాజ్ఞి కాలకూట విషం

సుందర భారత యాత్ర
మహోజ్వల భారతదేశ రామణీయకత
చదవండి! చూడండి!!
కన్యాకుమారి మొదలు కాశ్మీరువరకు నలుదిశలుగల వందలాది క్షేత్రములు నదీనదములు చారిత్రక నగరములు, శిల్ప విశేషములతో 280 చిత్రపటములతో మార్గదర్శకమగు దేశపటముతో సర్వజన సులభశైలిలో రచింపబడినది. 770 పే.
వెల రు. 4-0-0 పోస్టేజి 1-4-0
సాధన గ్రంథ మండలి, తెనాలి.

# "మళ్లా అమ్మతో చెప్పకేం?"

"నాన్నా నాన్నా. మళ్లా అమ్మతో చెప్పనంటే ఒకటి చెప్తాను. అమ్మకేం, అసలు పిల్లల్ని పెంచడం తెలీదు" అంది పదేళ్ళ రాధ.

ఏవమ్మా ఎంచేతేం అని అడిగాడు తండ్రి లాలనగా.

"ఎందుకంటే నాకు అస్సలు నిద్ర రానపుడేమో పడుకోమని కోప్పడుతుంది. తీరా పడుకున్నాక, ఇంకా చాలా నిద్ర రొస్తూఉంటే, లే లే అని బలవంతాన లేవగొట్టేస్తుంది."

---

కంఠంలో స్తంభింపజేసిన పరమేశ్వరుని దివ్యమూర్తిలా భాసించింది!

ధర్మరాజు వేడివేడి కన్నీరామె కాలి వేలిమీద పడింది. దానితో ఆమె హృదయం ద్రవించి పోయింది! వెంటనే ఆమె తనముఖం పక్కకు తిప్పివేసుకొన్నది!

ఇలా ముఖం తిప్పివేయడం చూచి పాండవులామె ఏమాత్రము సేదదేరలేదనీ ఇక ఉత్తరక్షణంలో శపించివెయ్యగలదనీ భయపడ్డారు.

కాని ఆమె ముఖం అటు తిప్పివెయ్యడానికి కారణం వేరు! ఆమె నేత్రాలకు బంధంగా కట్టుకున్న వస్త్రం సందులలో నించి ఏదైనా ఒక వీక్షణలేశం ధర్మరాజుమీద ప్రసరిస్తే అతను వెంటనే భస్మీపటలమై పోతాడేమోనని ఆమె భయం!

నూరుగురు కుమారులను అవిధంగా యుద్ధంలో పొట్టబెట్టుకున్న ధర్మరాజెదుట పడినా—ఆ సమయంలో లోలోపల శోక క్రోధాలు వ్యెత్తుగా పొంగి పరవళ్లుదొక్కినా... ఆమె మహానిగ్రహం అవలంబించి అత్యుదార హృదయంతో అతన్ని మన్నించింది! అయినా లోలోపల అగ్నిపర్వతమై బుసకొట్టే క్రోధంవల్ల ఏమైనా అపకారం జరగగలదేమోనని భయపడి జాగ్రత్తగా ముఖంపక్కకు తిప్పవేసుకొన్నది. కాని ఆ ముఖాచ్ఛాదనం అడుగుభాగంలోనించి ప్రసరించిన దృష్టిలేశం ధర్మరాజు కాలి బొటనవ్రేలిమీద పడింది. అంతే! ఆ ఉత్తరక్షణంలో అది నల్లని మసిబొగ్గై మాడిపోయింది!

ధర్మమూర్తి కా క్షణంలో అపార కరుణాపూరితమైన ఆమె మాతృప్రేమ స్ఫురించింది! ఆసమయంలో ఆమె క్రోధలేశం అవిధంగా తన కాలిబొటనవేలిమీద ప్రసరించడం ఒకవిధంగా ఆశీర్వదించడమే అనుకుని-లోలోపల హిమాచల ధీరమయిన ఆమె ఓరిమి కెంతో ఆశ్చర్యపోయినాడా ధర్మరాజు!

ఈ అల్పఘటనకు కూడా ఆమె లోలోపల ఎంతో నొచ్చుకొని ధర్మరాజును నేక విధాలుగా ఓదార్చింది! పాండవులందరు ధర్మమార్గానువర్తులై ధర్మం తప్పకుండా ప్రజాపరిపాలన చెయ్యాలని చేయెత్తి దీవించింది! ధర్మరాజు నోట మాటరాలేదు! అతని చెంపలనుండి అశ్రుధారలు సంతతధారగా ప్రవహించాయి!

అప్పుడే కొంచెం చీకటిపడింది. ఆకాశంలో అరుంధతీ సహితులైన సప్తమహర్షులు ప్రత్యక్షమైనారు. ఇందాకటినించీ కొంచెం కొంచెంగా ప్రారంభించిన జంబుకాక్రందనాలన్నీ ఏకమై ఒకే భయంకర రోదనగా మిన్నందుకొన్నాయి! దూర దూరంగా అక్కడక్కడ చితాజ్వాలలు వెలుగుతున్నాయి! ఎటుచూసినా ప్రళయమే నృత్యంచేసిన ఆ కురుక్షేత్ర మధ్యంలో ఆ గాంధారి, ప్రశాంతమైన ఆమె ముఖము మాత్రమే పాండవుల హృదయాలలో తిరిగి ఆశాజ్యోతులు ప్రజ్వలింపజేశాయి. ఆమె ఆ గంభీర రజనీదేవతా రూపంతో వారిపై చల్లని వెన్నెల వెలుగులు విరజిమ్మింది!

కొంతసేపటిదాకా ఎవరు ఏమి మాటాడలేకపోయారు! గాంధారి ధర్మరాజుతో "నాయనా! ద్రౌపది ఏదీ! రాలేదా!" అన్నది.

ద్రౌపది ఆమె పాదాభివందనం చేసింది. గాంధారి వెంటనే వంగి ఆమెను లేవనెత్తి గుచ్చి కౌగలించుకొన్నది!

ఆ యుద్ధంలో ద్రౌపదికుమారులయిదుగురు అశ్వత్థామ శస్త్రాగ్ని జ్వాలలో భస్మీపటలమైపోయారు! ఆ దుఃఖంలో కుమిలిపోయే ద్రౌపదికి గాంధారీదేవి సన్నిధిలో తిరిగి ఆ దుఃఖం అంతా కట్టలు తెంచుకొని ప్రవహించింది. ద్రౌపదిసన్నిధిలో గాంధారి తన పూర్వనిగ్రహం అంతా విస్మరించి కేవలం పసిపాపలా విలపించింది.

గాంధారి కొంతసేపటికి ద్రౌపదిని వివిధంగా ఓదార్చింది.

"అమ్మా! దుఃఖించినందువల్ల ప్రయోజనం ఏమి ఉన్నది! ఈ ఆపత్సమయంలో ఎలాంటివారికైనా ఓదార్పుకలగవచ్చుగాని-

---

శాస్త్రి: "గోవులకూ, గోమార్లకీ తేడా చెప్పరా అబ్బాయ్!"

అబ్బాయి: "గోవులకి గోమార్లు ఉంటాయండి. గోమార్లకి గోవులుండవు."

---

నీకు, నాకుమాత్రం ఓదార్పులేదు! నిన్ను, నన్ను ఓదార్చగలిగిన వారింకెవరున్నారు! తల్లీ! కేవలం నా మూలంగానే కౌరవ వంశం అంతా ఈ యుద్ధజ్వాలలో భస్మమైపోయింది! ఇప్పుడీ విధంగా ఎంత దుఃఖించినా ఈ చిచ్చు చల్లారగలదా తల్లీ! నేను నూరు పుత్రులో కాలేకన్నానుగాని నూరుగురు కొడుకులను మాత్రం కనలేను. అంతే!"

ద్రౌపది ఆ మహామాతృమూర్తి ఒడిలో తలదాచుకొని కొంత కొంత దుఃఖోపశమనం పొందగలిగింది!

కాళరాత్రిగా ప్రారంభించిన ఆ సాయంకాల వేళలో దూరదూరంగా చల్లని వెన్నెల వెలుగుల వెల్లువలు ప్రవహిస్తూ భూదేవికెంత ప్రశాంతి కలిగించాయి! ★

---


# పంచతంత్రం

## బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ 1-80

ఆంధ్ర గ్రంథమాల మద్రాసు.



దాంపత్య రహస్యములు

ఇది పటములతో 254 పుటలుగలది వెల రు. 2/-

కామకళారంగం అనే కోక్కోకంపటాలతో రు. 1/4-

కామకళా లేక కోక్కోకము పటములతో వెల 1/-

మూడునుకొన్నచో పోస్టుఖర్చు రు1/-వ్రాయండి.

D ఎస్. మిత్రా &కో 26 వీధి రాకాసుపేట మద్రాసు